యోగాతో మానసిక దృఢత్వం

విశాలాంధ్ర-మల్కాపురం : యోగా చేయడం వల్ల మానసిక దృఢత్వం ఏర్పడుతుందని, అది వ్యక్తిత్వ వికాసానికి దారితీస్తుందని సెయింట్ ఆన్స్ కళాశాల హిందీ అధ్యాపకురాలు మరియు యోగా శిక్షకులు ఎ. ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో శుక్రవారం జరిగిన యోగా శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా ప్రసంగిస్తూ- యోగా వల్ల క్రమశిక్షణ ఏర్పడుతుందని, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థినులచే యోగాసనాలను అభ్యసనం చేయించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థినులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు, ఎన్.సి.సి. క్యాడెట్లు పాల్గొన్నారు. వీరందరినీ జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అభినందించారు.

మంత్రి లోకేష్‌కు విశాఖ విమానాశ్రయంలో మేయర్ ఘన స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ నగరానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను విశాఖ విమానాశ్రయంలో స్వాగతం పలికిన నగర మేయర్ పీలా శ్రీనివాసరావు.

సింహాద్రినాథుని దర్శించుకున్న పలువురు ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారిని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, తదితర ప్రముఖులు దర్శించుకున్నారు. వీరికి ఇంచార్జ్ కార్యనిర్వహణాధికారి వి. త్రినాధరావు పూల మాలలు వేసి ఘన స్వాగతం పలికారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని, స్వామివారికి తమ తమ గోత్ర నామాలతో సంకల్పం చెప్పించారు. దర్శన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈఓ వారికి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్యపు అశోక్ రెడ్డి, భాష్యం ప్రవీణ్, పులవర్తి నాని, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి , యువరాజ్, ప్రసాద్, విశాఖ మేయర్ పీలా శ్రీనివాస్ రావు ఉన్నారు.

11వ అంతర్జాతీయ యోగా ఏర్పాట్లు పూర్తి

- పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖ వేదికగా యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా జూన్ 21 శనివారము ఉదయం విశాఖ బీచ్ ప్రాంతము లలో నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ దినోత్సవ కార్యక్రమం ఏర్పాట్లలో ప్రజలకు కల్పించే వసతులు, మౌలిక సదుపాయాలు పూర్తయ్యాయని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజి భరత్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి. సంపత్ కుమార్ , జీవీఎంసీ కమిషనర్ కేతన్ గర్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర లతో కలసి విశాఖ ఆర్కే బీచ్ యోగ ప్రధాన వేదిక నుండి జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వరకు యోగ దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లను, యోగా క్రియల కంపార్ట్మెంట్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ శాఖ మంత్రి మాట్లాడుతూ ఆర్కే బీచ్ నుండి భీమిలి బీచ్ వరకు 26 కిలోమీటర్ల పొడవునా, పరిసర ప్రాంతాల్లో యోగ క్రియల కొరకు ప్రజల కోసం ఏర్పాటుచేసిన మొత్తం 326 కంపార్ట్మెంట్లలో అన్ని వసతులతో కూడిన సదుపాయాలను పూర్తి చేసామని తెలిపారు. అలాగే ప్రజల సౌకర్యార్థమై అవసరమగు తాగునీరు సమృద్ధిగా ఏర్పాటు చేయాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా పారిశుద్ధ్య కార్మికులచే తొలగించే ఏర్పాట్లు చేయాలని, ఏర్పాటుచేసిన కంటైనర్ మరుగుదొడ్లను స్వయంగా పరిశీలించి మరుగుదొడ్లలో నిరంతరం నీటి సదుపాయం ఉండేలా చర్యలు చేపట్టాలని , ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలంకరణలో అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో పాటు కేంద్ర ,రాష్ట్ర మంత్రులు ,ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు , అధిక సంఖ్యలో ప్రజలు యోగాక్రియలో స్వయంగా పాల్గొంటున్నందున పూర్తిచేసిన ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని జీవీఎంసీ కమిషనర్ కు మంత్రి సూచించారు. యోగాంధ్ర లక్ష్యంగా విశాఖ లో జరుగుచున్న ఈ కార్యక్రమానికి దాదాపు 5 లక్షల మంది ప్రజలు యోగ క్రియలలో పాల్గొంటున్నారని ఇది ప్రజాప్రతినిధులు ,అధికారులు, ప్రజల భాగస్వామ్య సహకారంతోనే విజయవంతం అవుతుందని తెలిపారు. యోగాంధ్ర లక్ష్యంగా విశాఖ చరిత్రను గిన్నిస్ బుక్ లో స్థానం సాధన దిశగా 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలను విశాఖలో నిర్వహించడం జరుగుతున్నందున ఈ కార్యక్రమం జయప్రదం చేసేటట్లు అధికారులు అవసరమగు చర్యలు చేపట్టాలన్నారు . తదుపరి షిప్పులు పై యోగా క్రియలు కొరకు సముద్ర తీరానికి చేరుకున్న షిప్ లను మంత్రి తిలకించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రజా ఆరోగ్యపు అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రతో ట్రాఫిక్ ఇక్కట్లు...

బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు...

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : యోగాంధ్ర పుణ్యమా అంటూ నగరంలో జనజీవన స్తంభించి పోయింది. ఉన్న ఆర్టీసీ బస్సులన్నీ యోగాంధ్ర కార్యక్రమానికి జనాన్ని తరలించడానికి బస్సులు వెళ్లిపోవడంతో నగరంలో ఉద్యోగులు సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోపక్క రహదారులు ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్నాయి. జాతీయ రహదారిపై గంటలు తరబడి ట్రాఫిక్ స్తంభించుకోవడంతో అనేకమంది అవస్థలు పడ్డారు. గాజువాక నుండి మధురవాడ వరకు జాతీయ రహదారి తీవ్ర ట్రాఫిక్ తో స్తంభించిపోయింది. ఆర్టీసీ బస్సులన్నీ యోగాంధ్ర కార్యక్రమానికి వెళ్లిపోవడంతో నగరంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. నెలవారి బస్సు పాసులు తీసుకున్న ఉద్యోగులు, షాపుల్లో పనిచేసే కార్మికులు కు బస్సులు లేకపోవడంతో ఆటోలకు అధిక చార్జీలు చెల్లించాల్సి వచ్చిందని అనేకమంది ఆవేదన వ్యక్తం చేశారు. మరపక యోగాంధ్ర పుణ్యం అంటూ రెండు రోజులు పాటు స్కూల్ సెలవులు ప్రకటించగా, సముద్రంలో చేపల వేట కూడా రెండు రోజులు పాటు నిషేధించారు. బీచ్ రోడ్ లో వీధి వ్యాపారులు గత వారం రోజులుగా బంద్ చేయించిన పరిస్థితి నెలకొంది.

నేడు జరగనున్న యోగాంధ్ర కోసం విస్తృత ఏర్పాట్లు...

విశాలాంధ్ర-మధురవాడ : విశాఖలో నేడు(శనివారం) జరగనున్న యోగాంధ్ర విజయవంతానికి అధికారగణం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.విశాఖతో పాటు పరిసర జిల్లాల అధికార గణాలు ఈ కార్యక్రమాలలో పాల్గొంటున్నాయి. అందులో భాగంగా శుక్రవారం మధురవాడ మారికవలస జాతీయ రహదారి నుండి ఐ.టీ. స్టేజ్ రొడ్డులో విజయనగరం నుండి వచ్చిన అధికార గణాలను ఆ జిల్లా అదనపు యస్.పి. సౌమ్య లత అధికార గణాలకు వారివారి బాధ్యతలు వివరించి, వారికి నిర్దేసించిన ప్రాంతాలకు వారికోసం ఏర్పాటు చేసిన బస్సులలో తరలించారు. ఈ సందర్భంగా ఆమె విశాలాంధ్ర ప్రతినిధితో మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోడీ, పాల్గొనే విశాఖ యోగాంధ్ర లో పాల్గొనే వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా తమకు కేటాయించి న విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. 2023 లో 1.53 లక్షల మందితో జరిగిన ప్రపంచ యోగా కార్యక్రమం గీన్నిస్ రికార్డు సాధించింది. నేడు విశాఖలో జరిగే యోగాంధ్ర పాత రికార్డు ను అధిగమిస్తుందన్న ఆశాభావం సర్వత్ర కనిపిస్తుంది. మనమూ ఆశిద్ధామ్.

శ్రీ వరాహలక్ష్మీ నృహరి "శతకము" పుస్తకాన్ని ఆవిష్కరించిన ఈఓ

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి పై భాషా ప్రవీణ, శ్రీమాన్ అద్దంకి వెంకట రాఘవాచార్యులు రచించిన శ్రీవరాహ లక్ష్మీ నృహరి "శతకము" పుస్తకాన్ని ఇంచార్జ్ ఈఓ త్రినాధరావు ఆవిష్కరణ చేశారు. భారతదేశంలో నృసింహ క్షేత్రాలు చాలా విస్తారంగా ఉన్నాయి. అక్కడక్కడ వరాహ క్షేత్రాలూ ఉన్నాయి. వరాహ, నృసింహ రూపాల మేలు కలయికతో విరాజిల్లుతున్న ఏకైక క్షేత్రం శ్రీ సింహాచలం. అతి ప్రాచీనమైన క్షేత్రం ఈ సింహాచలం. ఇది సంస్కృతీ, సంప్రదాయాలకు కాణాచి. ప్రహ్లాద రక్షణార్థం శ్రీ నృసింహ ప్రభువు స్వీకరించిన 32 నృసింహ రూపాలను శ్రీ సింహాచల క్షేత్ర మహాత్మ్యము ప్రస్తావించింది. అది క్షేత్ర మహాత్మ్యం చదివిన వారికి, చదవగలిగిన వారికి మాత్రమే తెలుస్తుంది. అలా కాకుండా సామాన్యులకు కూడా శ్రీ నృసింహుని 32 రూపాలు, వాటి లక్షణాలను తెలియపరచాలి అనే ఉద్దేశ్యంతో ఆనాటి మహనీయులు ఆలయ స్తంభాల మీద వాటిని మలచి మనకు అందించారు. ప్రహ్లాద రక్షణార్థం శ్రీ నృసింహ ప్రభువు స్వీకరించిన 32 రూపములు శ్రీ సింహాచల ఆలయ మ స్తంభాలపై చిత్రీకరించి ఉన్నాయి. భక్తరక్షణమే పరమ లక్షణంగా గల స్వామి వైభవాన్ని, వాత్సల్యాన్ని లోకానికి తెలియజేయడం కోసమా అన్నట్టు ఆనాటి ప్రభువులు ఈ 32 రూపాలను పొందుపరచి శిలాస్థగితంగా మనకందించారు. వారి ఉదార స్వభావానికి నమోవాకాలు., అలాగే నేడు స్వామి వారి దివ్య ఆశీస్సులుతో భాషా ప్రవీణ , శ్రీమాన్ అద్దంకి వెంకట రాఘవాచార్యులు రచించిన శ్రీ వరాహ లక్ష్మీ నృహరి "శతకము" పుస్తకం ఆవిష్కరణ మహోత్సవం శ్రీశ్రీశ్రీ సింహాచల దేవస్థానం ఆలయ కార్య నిర్వహణ అధికారి వేంద్ర త్రినాధరావు ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్యులు సహాయ కార్య నిర్వహణాధికారి నక్కాన ఆనంద్ కుమార్ దేవస్థానం అర్చక బంధంతో పుస్తక ఆవిష్కరణ అత్యంత వైభవంగా జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు త్రిమూర్తులు, పి ఆర్ ఓ నాయుడు ఉద్యోగులు పాల్గొన్నారు .

యోగా మన సాంస్కృతి, సాంప్రదాయం

95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు

విశాలాంధ్ర-పెందుర్తి : యోగా భారతీయ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతిబింబమని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పేర్కొన్నారు. వార్డు పరిధిలోని ఎన్ఏడి లే అవుట్ పార్కులో శుక్రవారం ఉదయం యోగా మాస్టర్ శర్మ, పార్కు కమిటీ ఆధ్వర్యంలో యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెందుర్తి బిజెపి నాయకులు, స్థానిక జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని యోగా చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరమని, ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్ప వరం యోగా అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతగానో తోడ్పడుతుందని, ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విశాఖపట్నంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో వికసిత్ భారత నిర్మాత, ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొంటున్నారని తెలిపారు. రికార్డు స్థాయిలో నిర్వహించే ఈ వేడుకను విజయవంతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. యోగా వ్యాయామం మాత్రమే కాదు మన జీవన విధానం అని చాటి చెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఏడి లే అవుట్, ఎల్ఎన్ నగర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, అత్తిలి నాగేంద్ర కుమార్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాలి...

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని..

అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'యోగా'

విశాలాంధ్ర-విశాఖ సిటీ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అమ్మకం చర్యలు ఆపి ప్రభుత్వరంగంలో కొనసాగించాలని, అక్రమంగా తొలగించిన స్టీల్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద 'నిరసన యోగా' ఉదయం 7.30 గంటల నుండి 10.30 గంటల వరకు చేపట్టింది. సేవ్ వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలి, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని పెద్దఎత్తున నినాదాలు చేసి యోగా జరిపారు. ఈ సందర్భంగా 78వవార్డు కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు అమ్మకం ఆపుతున్నట్లు నరేంద్రమోడీ రేపు విశాఖలో జరుగుతున్న యోగాంధ్రలో ప్రకటన చేయాలని డిమాండ్ చేసారు. గత నాలుగున్నర సం.లుగా స్టీల్ పరిరక్షణకోసం ఆంధ్ర రాష్ట్ర ప్రజలు పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం చీమకుట్టినట్లుగా వ్యవహరించక పోవడాన్ని తప్పుపట్టారు. ప్లాంట్ ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను 4వేల మందిని అక్రమంగా, అన్యాయంగా తొలగించడానికి కేంద్ర, రాష్ట్రాలు పూనుకోవడాన్ని విమర్శించారు. గంట జరిగే యోగా కార్యక్రమానికి వందల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని లూటీ చేయడం సరైందికాదన్నారు. ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు, జెఎసి కన్వీనర్ బి.నాగభూషణం మాట్లాడుతూ విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో పోరాడి సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను అమ్ముతామంటే ఆంధ్రరాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. ప్లాంట్‌లో అదనంగా ఉద్యోగాలు వేయడానికి అవకాశం ఉన్నా మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చర్యల్లో భాగంగా ఉన్న ఉద్యోగులను, కార్మికులను తొలగించడానికి పూనుకుందన్నారు. దీనిని ఆపాల్సిన రాష్ట్ర కూటమి ప్రభుత్వం మోడీకి భజనచేస్తూ కార్మికులపై నిర్భంధం ప్రయోగిస్తుందన్నారు. విశాఖకు వస్తున్న మోడీ తక్షణమే విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేసారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, సిఎఫ్‌టియుఐ రాష్ట్ర అధ్యక్షులు కనకారావు, ఎపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి దేవా మాట్లాడుతూ యోగా పేరుతో ప్రజల సమస్యలను, కార్మికుల సమస్యలను పక్కకుపోయాయన్నారు. స్టీల్ ప్లాంట్ ఉద్యమం గత నాలుగున్నర సంవత్సరాలుగా జరుగుతున్నా మోడీ, బాబూలుకు పట్టడం లేదన్నారు. ప్లాంట్ పరిరక్షించాలని, సొంతగనులు కేటాయించాలని, కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని తదితర డిమాండ్లతో చేపట్టే యోగాకు ప్రజలు, కార్మికుల నుండి మంచి స్పందన లభించందన్నారు. భవిష్యత్‌లో ఈ ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, బి.జగన్, ఎం.సుబ్బారావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యు.ఎస్.ఎన్.రాజు, ఎస్.శ్రావణ్‌కుమార్, ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు, అధ్యక్షులు జి.అజయ్, డి.వెంకటరమణ, ఐద్వా నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, కె.కుమారి, రమణి, కొండమ్మ, పెన్షనర్స్ సంఘం నాయకులు వి.తులసీరాం, కుమార్‌మంగళం, అనపర్తి అప్పారావు, మత్యకార్మికసంఘం నాయకులు కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రి కొండపై 108 నృత్త కరణాలలో యోగాసనాలు

యోగాంధ్ర సందర్భంగా నిర్మల నృత్యానికేతన్ విద్యార్థుల ప్రదర్శనలు

విశాలాంధ్ర-పెందుర్తి : ప్రపంచ యోగా దినోత్సవం యోగాంధ్ర కార్యక్రమాలు సందర్భంగా ఉత్తరాంధ్ర తిరుపతి పెందుర్తి వెంకటాద్రి పై చిన్నముషిడివాడ నిర్మల నృత్య నికేతన్ విద్యార్థులు 108 నృత్త కరణాలలో యోగాసనాలు ప్రదర్శించి అలరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ జ్యోతి పర్యవేక్షణలో విద్యార్థుల ప్రదర్శించిన యోగాసనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. నాట్య యోగం అతి పురాతన నాట్య గ్రథంగా ఇటీవలే యునెస్కో గుర్తింపు పొందిన "నాట్య శాస్త్రం "లో భరతముని వివరించిన 108 నృత్త కరణాలలో యోగాసనాలు మిళితమై ఉన్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆలోచన మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా ఈ నాట్య యోగాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ జ్యోతి తెలిపారు. శ్రీ నిర్మల నృత్య నికేతన్ నృత్య విద్యార్థినులు పలు క్లిష్టమైన నృత్త యోగ కరణాలు, సూర్య నమస్కారాలు ప్రదర్శించారన్నారు. ముఖ్యంగా శర్వాణి, జాహ్నవి స్థిరఆసనం, లాసిత పాద హస్తాసనం, లలాట తిలకం శర్వాణి, ఈక్షిత, శ్రీ జాషి, ఆర్గళ శ్రీచందన ప్రదర్శన, ధనురాసనం ఈక్షిత ప్రదర్శించి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నారు. నిర్మల నృత్య నికేతన్ విద్యార్థిణుల ప్రదర్శనలను ఆలయ పండితులతో పాటు భక్తులు ప్రశంసించారు.

యోగా దినోత్సవ ఏర్పాట్లు బేష్ : సీఎస్ విజయానంద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : విశాఖ సముద్రతీరంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శుక్రవారం పరిశీలించారు. ప్రధాన వేదిక, కంపార్ట్‌మెంట్‌లను, లోపల చేసిన ఏర్పాట్లను, ఎల్ఇడి స్క్రీన్, సౌండ్ సిస్టమ్ను పరిశీలించారు. అక్కడ చేసిన ఏర్పాట్లు గురించి సిఎస్‌కు ప్రధాన వేదిక ఇన్‌ఛార్జ్, విఎంఆర్‌డిఏ కమిషనర్ కెఎస్ విశ్వనాథ్ వివరించారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు. ఏర్పాట్లన్నీ పకడ్బందీగా నిర్వహించాలని, ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

1.50 లక్షల ప్రదేశాల్లో యోగా ప్రదర్శన : రాష్ట్రంలోని సుమారు లక్షా, 50వేల ప్రదేశాల్లో శనివారం యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని యోగాంధ్ర నోడల్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు చెప్పారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, విశాఖపట్నంలోని అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు యోగా ప్రదర్శనలో పాల్గొంటారని, అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా లక్షన్నర ప్రదేశాల్లో కూడా ప్రదర్శనలు జరుగుతాయని వివరించారు. ఇదొక సరికొత్త రికార్డు అని ఆయన పేర్కొన్నారు. సముద్రతీరంలో జరిగే యోగా దినోత్సవ వేడుకలకు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. సుమారు పదివేల వాహనాల్లో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి ఈ ప్రదర్శనలో భాగస్వాములు కానున్నారన్నారు. ఇప్పటి వరకు సూరత్‌లో జరిగిన కార్యక్రమంలో సుమారు లక్షన్నర మంది యోగా ప్రదర్శనలో పాల్గొని రికార్డు సృష్టించారని, దానిని అధిగమించి 3లక్షలకు పైబడి ఈ యోగా ప్రదర్శనలో పాల్గొనేటట్లు ఏర్పాట్లు చేశామని చెప్పారు. అదేవిధంగా ఏయూ గ్రౌండ్‌లో 25వేల మంది విద్యార్థులతో 15 నిమిషాల పాటు సూర్య నమస్కారాలు చేయడం ద్వారా మరో కొత్త రికార్డును సృష్టిస్తున్నామని కృష్ణబాబు తెలిపారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-అనందపురం : మండలంలో వెల్లంకి గ్రామం యాత కులానికి చెందిన పైడా అప్పలరాజు (24) మనస్థాపంతో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృత్తులు తల్లి వెంకటలక్ష్మి వివరాల ప్రకారం వెల్లంకిలో నివాసముంటోంది. వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నది .భర్త సూరిబాబు బొడ్డపాలెం ప్లైవుడ్ కంపెనీలో పనిచేస్తున్నారు. పెద్ద కుమారుడు అప్పలరాజు డిగ్రీ పూర్తి చేసి వెల్డింగ్ పని చేస్తూ కుటుంబానికి తోడ్పడుతుండగా, చిన్న కుమారుడు చంద్రశేఖర్ ఇంటర్మీడియట్ పూర్తయ్యాక అదే పనిలో ఉన్నాడు. అప్పలరాజు గత సంవత్సరం దుబాయ్ వెళ్లి పని చేయాలనే ఆశతో ఢిల్లీలో ఇంటర్వ్యూకు హాజరై విజయవంతమయ్యాడు. వీసా ఖర్చుల నిమిత్తం కుటుంబం రూ.1.5 లక్షలు ఖర్చు చేసినా, ఎటువంటి సమాచారం రాకపోవడంతో విదేశీ ప్రయాణం రద్దయ్యింది. దీంతో అప్పలరాజు తీవ్ర నిరాశకు గురై, అదే ఏడాది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్పట్లో ప్రాణాలు కాపాడగలిగారు. తాజాగా జూన్ 15న, మళ్లీ దుబాయ్ ప్రయాణానికి ప్రయత్నిస్తూ రూ.1 లక్ష ఏర్పాటు చేయమని తల్లిదండ్రులను కోరాడు. అయితే తండ్రి సూరిబాబు "ఇద్దరూ కలిసి వైజాగ్‌లోనే పనిచేయండి" అంటూ మందలించడంతో అప్పలరాజు మానసికంగా ఆందోళనకు లోనయ్యాడు. అప్పటి నుంచి భోజనం చేయడం మానేశాడు. జూన్ 19న ఉదయం తల్లి వెంకటలక్ష్మిని బండిపై కంపెనీ దగ్గర వదిలి ఇంటికి వచ్చిన అప్పలరాజు, గదిలోకి వెళ్లి పడుకున్నాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో తలుపులు తట్టినప్పటికీ స్పందించక పోవడంతో తలుపు తెరిచి చూడగా అతను అపస్మారక స్థితిలో పడి ఉండి, మంచంపై వాంతులు, గడ్డి మందు బాటిల్ కనిపించాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108 కు సమాచారం ఇచ్చి అతనిని కేజీహెచ్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే, అదే రాత్రి జూన్ 20, అర్ధరాత్రి 12:30 గంటలకు వైద్యులు అతని మృతిని ధృవీకరించారు. ఈ మేరకు ఆనందపురం ఎస్సై సంతోష్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ సత్తిబాబు కేసు దర్యాప్ చేస్తున్నారు.

సేవలు స్ఫూర్తి దాయకం

విశాలాంధ్ర-పెదగంట్యాడ : విశాఖ ఉక్కు కర్మాగారంలో మూడు దశాబ్దాలకు పైగా విధులు నిర్వహించి ఈనెల 30 న ఉద్యోగ విరమణ చేయనున్న ఉక్కు జనరల్ ఫోర్మెన్లు జి.ఆనంద్ (ఎం.ఎం.ఎస్ ఎం), బి.సాయిరాం (టెలికాం) ల ఆత్మీయ సత్కార కార్యక్రమం స్టీల్ ఏ. ఐ.టి.యూ.సి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి స్టీల్ ఏ.ఐటి.యూసి అధ్యక్షులు కె.ఎస్ ఎన్ రావు, ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న జి.ఆనంద్, బి.సాయిరాంలు ఏ.ఐ.టి.యూ.సిలో కీలకంగా పని చేస్తూ యూనియన్ నేతలుగా ఎదిగారని కొనియాడారు. ఉక్కు ఉద్యోగులుగా ఉక్కు కర్మాగారం ప్రగతికి కృషిచేస్తూ యూనియన్ బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆనంద్, సాయిరాం లను జ్ఞాపికలు, బొకేలతో ఘనంగా సత్కరించారు. డొక్కా నర్సింగరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తాండ్ర కనక రాజు, ఎస్.మోహన్ బాబు, బి.ఎం ఎల్ నాయుడు, డి.దేముడు, టి.ఎస్.ఎన్, గంటా రాజు, చీకటి శ్రీనివాస్‌రావు, సి.హెచ్ రవి పాల్, శివరామకృష్ణ, శ్రీనివాస్, పి.వి.సాగర్, జీవి రమణారావు, చిట్టిబాబుతో పాటు ఏ.ఐ.టి.యూ.సి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడ్కో లబ్ధిదారులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-పెదగంట్యాడ : టీడ్కో ఇండ్ల కాలనీలో మౌలిక వసతుల కల్పనకు 2025 -26 బడ్జెట్ నుండి ఆదనపునిధులు 103కోట్లు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2014 లో తెలుగుదేశం ప్రభుత్వం ఉండగా ఈ కాలనీలో నిర్మాణం చేయడమైనది. టీడ్కో లబ్ధిదారులు దాదాపు తొమ్మిది సంవత్సరాల నుండి ప్రభుత్వాని కి కట్టవలసిన మొత్తం సొమ్మును బ్యాంకు నుండి కూడా లోన్ తీసుకొని ప్రభుత్వానికి చెల్లించారు. లోన్లు, నెల వాయిదాలు అద్దెలు కట్టుకోలేక చాలా ఇబ్బంది పడుతున్నారు. వారికి తొమ్మిది సంవత్సరాల కావస్తున్న ఈరోజు వరకు వాళ్ళ సొంత ఇంటి కలను నెరవేర్చలేదు. భానోజీ తోట, పెద్ద గంట్యాడ, బర్మా కాలనీ, దువ్వాడ, తాలారివాని పాలెం, ట్రై జంక్షన్ ఏరియాలో 6,576 ఇల్లు నిర్మాణాలు జరిగాయి కానీ ఈరోజు వరకు వాళ్ళు ఇల్లులు పూర్తి చేసే ఇవ్వలేదు. లబ్ధిదారులు ఆందోళన చేయగా 9-6-2025 గాజువాక జోనల్ కార్యాలయములో కమిషనర్ శేషాద్రిగారి ఆధ్వర్యంలో టీడ్కో టాటా ప్రాజెక్ట్, బ్యాంక్, అధికారులతో టీడ్కో లబ్ధిదారులతో సమావేశం ఐయ్యి వాళ్లకి మౌలిక సదుపాయాలతో కూడిన ఇండ్లు ఏర్పాటు చేయడానికి అధికారులు అందరూ హామీతో సంతోషాన్ని వ్యక్తపరిచారు. టీడ్కో ఎండి సునీల్ కుమార్ మరియు మున్సిపాలిటీ మినిస్టర్ నారాయణ కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లి మీసమస్యను, త్వరలోనే పరిష్కరిస్తానని చెప్పడం అయినది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ టైడ్కో డైరెక్టర్ వారికి నూట మూడు కోట్లు నిధులురిలీజ్ చేయడమైనది. ఈ నియోజకవర్గంలో అధికారులు హామీమరియు స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాసరావు సహకరిస్తే తక్షణమే15 కోట్ల రూపాయలు ఏరియాకి ఇచ్చినట్లయితే కాంట్రాక్టర్లు టీడ్కో ఇండ్లు మౌలిక సదుపాయాలతో ఇచ్చినట్లు ఐతే టీడ్కో గృహ లబ్దదారులు వాళ్లు ఇంటి సొంత కలను నెరవేర్చవచ్చు. అలాగే జి వి ఎం సి వారు మంచినీళ్ల సమస్యను వాళ్ళ అగ్రిమెంట్ ప్రకారం ఇచ్చినట్లయితే లబ్ధిదారులు సొంత ఇంటి కల నెరవేరుతుంది. వీటిపై తక్షణమే టీడ్కో చైర్మన్ , శ్రీ మంత్రివర్యులు నారాయణ ఇచ్చిన మాట ప్రకారం దసరా కు ఇల్లునుపూర్తిచేసి వాళ్ళ ఇల్లు వాళ్లకి ఇవ్వవచ్చును. తొమ్మిది సంవత్సరాల నుండి రోజువారి పని చేసుకుంటూ చేతి వృత్తి పనులు చేసుకుంటూ బలహీన వర్గాలు చెందినవారు ఎదురుచూస్తున్న తరుణంలో లబ్ధిదారులకు న్యాయం చేసేలా అధికారులు మాట్లాడటం హర్షించదగిన విషయం గా అభివర్ణించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ జిల్లా కార్య వర్గ సభ్యురాలు కె. వనజాక్షి నాయకులు జి. ఆనంద్, కె. అచ్యుతరావు, ఓ ప్రకటన విడుదల చేశారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర.

సిఐఎన్ నం. : యు65922ఎంహెచ్2005పిఎల్‌సి272501

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం -2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 9తో చదివే సెక్షన్ 13(12) కింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా సంబంధిత నోటీసులో పేర్కొన్న బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 9తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు ఈ కింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది.

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని,ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా ఈ కింద పేర్కొన్న మొత్తం బకాయి మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొదలైనవాటి కొరకు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ బ్రాంచ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత, హామీదారు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

క్ర. సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎకౌంట్ నం.	డిమాండ్ నోటీసు తేదీ మొత్తం బకాయి	ఆస్తి యొక్క వివరాలు	స్వాధీనత రకం & తేదీ
1	అపర్ణ ఎం ఎ, కొంగళ్ల వెంకట శంకర సూర్యనారాయణ, కొంగళ్ల అచ్యుతాంబ HL0000000140950	20- మే-24 15-మే-24 నాటికి రూ.6281381	కొత్త డి.నం.22/1/38, పాత డి.నం. 1-1-55, ఎస్.నం.358/1, బ్లాక్ నం.1, వార్డ్ నం.1, అసెస్‌మెంట్ నం.9, బొంతువారి స్ట్రీట్, నర్సీపట్నం రెవెన్యూ గ్రామం మరియు మున్సిపాలిటీ, నర్సీపట్నం మండలం, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్-531116, మొత్తం ప్లింత్ ఏరియా 2251 ఎస్ఎఫ్‌టి, 190.19 చదరపు గజాల భూమి కొలత. హద్దులు: ఉత్తరం: బొంతు సత్యనారాయణ ఇల్లు, దక్షిణం: పంచాయతీ రోడ్డు, తూర్పు: బొంతు దేముడు ఇంటి గోడ, పడమర: బొంతు రాజేశ్వరి ఇల్లు.	భౌతిక స్వాధీనత స్వాధీనత తేదీ: 17-జూన్ -2025

తేది: 21.06.2025

ప్రదేశము: అనకాపల్లి

అధీకృత అధికారి

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

విశాలాంధ్ర
పేజి : 2
విశాఖపట్నం
శనివారం 21, జూన్ 2025

రౌతు శ్రీను ఆధ్వర్యంలో సిరి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-ఆనందపురం : మండలంలో పాలవలస పంచాయతీ పరిధిలో భీమిలి వ్యవసాయం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రౌతు శ్రీను ఆధ్వర్యంలో భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త విజయనగరం జిల్లా పరిషత్ సభ్యులుమజ్జి శ్రీనివాసరావు, కుమార్తె, సిరి జన్మదిన వేడుకలు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా శుభాకాంక్షలు తెలిపి గ్రామ ప్రజల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ రౌతు వెంకట్రావు, సర్పంచ్ నాగోతు అచ్చియమ్మ, వైయస్సార్సీపి పాలవలస గ్రామ అధ్యక్షులు గురజాన శ్రీను, పైడి నాయుడు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం.. మీకు శతకోటి వందనం..

- సొంత ఇల్లే లేదు.. కానీ పది కరెంటు మీటర్లు..?
- భార్యాభర్తల ఆధార్ కార్డుపై 10 విద్యుత్ మీటర్లు..
- ఇచ్చిన హామీలు నెరవేర్చలేక షరతులు...
- విద్యుత్ శాఖ, సచివాలయాలు ఎదుట బారులు తీరిన తల్లిదండ్రులు
- ప్రజలను మోసం చేసే ఏ ప్రభుత్వానికైనా ప్రజావ్యతిరేకత తప్పదు..
- ప్రభుత్వ తీరుపై ప్రజాగ్రహం

విశాలాంధ్ర-గోపాలపట్నం : ఒక ఆధార్ కార్డు మీద ఒక విద్యుత్ మీటరు కానీ విద్యుత్ శాఖ అధికారాలు లీలలు వలన ఒక ఆధార్ కార్డు మీద ఏకంగా 8 మీటర్లు,మూడు మీటర్లు,నాలుగు మీటర్లు ఇలా సొంత ఇల్లు లేని వారికి కూడా విద్యుత్ మీటర్ల జారీ చేశారు విద్యుత్ శాఖ అధికారులు. తల్లికి వందనం పడలేదని బాధితు తల్లిదండ్రులు సచివాలయనికి వెళ్లి వివరాలు అడగగా మీ పేరు మీద విద్యుత్ బిల్ ఎక్కువ వచ్చింది మీ పేరు మీద ఏకంగా 10 కరెంటు మీటర్లు ఉన్నాయని సచివాలయం సిబ్బంది చెప్పడంతో అవక్కయ్యారు బాధిత తల్లిదండ్రులు. తల్లికి వందనం రాష్ట్ర ప్రభుత్వం స్కూలు తెరవకముందు వేస్తానని మాట ఇచ్చి తల్లికి వందనం పథకం కొంతమందికి మాత్రమే డబ్బులు వారి ఖాతాలలో జమ చేసి మరి కొంతమందికి తల్లికి వందనం పడకపోవడంతో వెరిఫికేషన్ కోసం సచివాలయనికి వెళ్లిన ప్రతి వ్యక్తి దగ్గర 35 రూపాయలు చార్జీలు వసూలు చేసి మీ పేరు మీద కరెంటు మీటర్లు ఎక్కువ ఉన్నాయి అవి కూడా 300 యూనిట్లు మించి విద్యుత్ వాడకం జరిగిందని అందుకే మీరు తల్లికి వందనం పథకానికి అనర్హులని తెలపడంతో అవాకయ్యారు బాధిత కుటుంబ సభ్యులు. మరి కొంతమందికైతే మీకు 1000 చదరపు గజాలు లలో ఇల్లు ఉన్నందున మీకు తల్లికి వందనం వర్తించదని స్థానిక సచివాలయం అధికారులు బాధి, తెలియకుండా తెలియజేశారు. అసలు మాకు సొంత గృహమే లేదు అలాంటిది మా పేరు వెయ్యి చదరపు గజాల ఇంటి స్థలంలో ఇల్లు, ఇంటికి కరెంటు మీటర్లు , అది 300 యూనిట్లు దాటి విద్యుత్ వాడకం ఎలా వచ్చేయో తెలియడం లేదంటూ వాపోయారు.సరేలే అని స్థానిక కరెంట్ ఆఫీస్ కి వెళ్లి విద్యుత్ శాఖ

అధికారులకు అడిగి వివరాలు తెలుసుకుందామని ప్రయత్నించగా చూస్తాం చేస్తామని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో చేసేదేమీ లేక నిరుత్సాహంతో వెను తిరుగుతున్నారు.ప్రభుత్వం మార్పులు చేర్పులకు కేవలం వారం రోజుల సమయం ఉన్నప్పటికీ బాధితులు ఇవన్నీ నిరూపించుకున్నంత సమయం వారికి లేదు ఇంకెవరికైనా భారీ బాధను చెప్పుకుందామంటే వినే నాధుడే లేనందున ఈ సంవత్సరానికి మాకు ఇంక తల్లికి వందనం రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంతిల్లు లేకపోయినా పది మీటర్లు ఉన్నాయని, 1000 చదరపు గజాలు ఇల్లు ఉందని, 300 యూనిట్లు మించి విద్యుత్ వినియోగం చేశారని కొంతమందిని అనర్హులుగా మరికొందరికి అయితే ప్రతినెల 500 లేదా 600 రూపాయలు వచ్చే కరెంట్ బిల్లు ఈ పథకం మూలంగా 1500 నుండి2000,3000 రూపాయలు కూడా అధిక బిల్లులు వస్తున్నాయి ఇదంతా కేవలం తల్లికి వందనం మహిమే అంటున్నారు మరి కొంతమంది బాధితులు. ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం 15,000 రూపాయలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి నేడు ఆ హామీని నెరవేర్చలేక ఇలా కుంటి సాకులు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారంటూ బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకాన్ని అమలు చేసేటప్పుడు ఉన్న షరతులు ఆనాడు ఎన్నికల ముందు హామీ ఇచ్చేటప్పుడు ఈ పథకానికి ఈ రకమైన షరతులు ఉంటాయని ఎందుకు చెప్పలేదు అని సూటిగానే ప్రజా ప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. కేవలం ఈ పథకానికే ఇన్ని షరతులు పెడితే మిగిలిన పథకాలకు, హామీలకు ఇంకెన్ని షరతులు పెట్టి వాటిని కూడా ఇలా ఎన్ని కుంటి సాకులు చెబుతూ నీరు గారుస్తారో అని బాధిత ప్రజలు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.నేటి ప్రభుత్వం కంటే గత ప్రభుత్వం లోనే నయం ఎందుకంటే ఇంటిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నప్పటికీ కనీసం ఇంటిలో ఒకరికైనా అమ్మఒడి పథకాన్ని అందించారని ఇలాంటి కుంటి సాగులు గతంలో ఎప్పుడు ఎవరూ చెప్పలేదని ప్రభుత్వంపై విమర్శలు అధికమవుతున్నాయి. 'కొండనాలుకకు మందు పెడితే ఉన్న నాలుక ఊడిందట" అన్నట్లు ఉంది తల్లికి వందనం బాధిత కుటుంబాల తల్లిదండ్రుల మనోవేదన. కనీసం ఎప్పటికైనా కళ్ళు తెరిచి మిగిలిన పథకాలకైనా షరతులు వగైరాలు పెట్టకుండా లబ్ధిదారులకు పథకాలు అందే విధంగా చూడాలని స్థానిక నాయకులకు రాష్ట్ర నాయకులకు ప్రజలు సూచిస్తున్నారు. ప్రజలను మోసం చేసే ఏ నాయకుడికైనా ఏ ప్రభుత్వానికైనా ప్రజావ్యతిరేకత తప్పదని హెచ్చరిస్తున్నారు. ఇక మీదట ఏం జరుగుతుందో వేచి చూడాలి.

దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ విస్తరణకు రూ.2000 కోట్ల అమెజాన్ ఇండియా పెట్టుబడి

విశాలాంధ్ర-విశాఖపట్నం: భారతదేశంలో అత్యంత సురక్షితమైన, వేగవంతమైన, అత్యంత విశ్వసనీయ కార్యకలాపాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని, నిర్వహించడానికి తన నిబద్ధతలో భాగంగా, అమెజాన్ 2025లో రూ.2000 కోట్లకు (యూ ఎస్ డీ 233 మిలియన్లు) పైగా పెట్టుబడి పెట్టనుంది. ఈ పెట్టుబడి కార్యకలాపాల మౌలిక సదుపాయాలను విస్తరించడానికి, అప్‌గ్రేడ్ చేయడానికి, భాగస్వాముల భద్రత, సంక్షేమ కార్యక్రమాలను మెరుగుపరచడానికి, తన ఫుల్‌ఫిల్‌మెంట్ నెట్‌వర్క్‌కు కొత్త సాధనాలు, సాంకేతికతను అభివృద్ధి చేసుకునేందుకు వినియోగించనున్నారు. ఈ కొత్త పెట్టుబడి భారతదేశం వ్యాప్తంగా సేవలందించదగిన అన్ని పిన్ కోడ్‌లకు కంపెనీ తన ఉత్పత్తులను అందించడానికి సహాయపడే ఓపీఎస్ నెట్‌వర్క్‌ను సృష్టించడంలో అమెజాన్ పెట్టుబడులపై ఆధారపడి ఉంటుంది. 'భారతదేశంలో ఒక దశాబ్ద కాలంగా, దేశవ్యాప్తంగా ఉన్న మా వినియోగదారులకు భద్రత, వేగం, పరిణామం, విశ్వసనీయతతో అందించేందుకు రూపొందించబడిన అత్యుత్తమ లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను నిర్మించడంపై మేము దృష్టి సారించామని అమెజాన్ ఇండియా మరియు ఆస్ట్రేలియా ఆపరేషన్స్ ఉపాధ్యక్షుడు అభినవ్ సింగ్ పేర్కొన్నారు. ఈ తాజా పెట్టుబడులు మా ఫుల్‌ఫిల్‌మెంట్, క్రమబద్ధీకరణ, డెలివరీ నెట్‌వర్క్‌లో మా కార్యకలాపాలను నిరంతరం విస్తరించేందుకు, అప్‌గ్రేడ్ చేయడానికి మా నిబద్ధతను ప్రతిబింబిస్తాయని చెప్పారు. మా మౌలిక సదుపాయాల సామర్థ్యాలను బలోపేతం చేయడం, ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయడం ద్వారా, భారతదేశం వ్యాప్తంగా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు మేము అమెజాన్‌ను తీర్చిదిద్దామని తెలిపారు.

బార్బిక్యూ నేషన్ 'కుక్కడ్ కార్నివాల్' ప్రారంభం

జూలై 10వ తేదీ వరకు ఈ చికెన్ ఫుడ్ ఫెస్టివల్

విశాలాంధ్ర-విశాఖపట్నం : దేశంలో ప్రముఖ బఫే డైనింగ్ చైన్ బార్బిక్యూ నేషన్ 'కుక్కడ్ కార్నివాల్' ను ప్రారంభించింది. ఈ చికెన్ ఫుడ్ ఫెస్టివల్ జూలై 10వ తేదీ వరకు జరగనుంది. ఈ ఫెస్టివల్‌లో ప్రత్యేకంగా చికెన్ వంటకాలు నోరూరించనున్నాయి. ఈ సందర్భంగా బార్బిక్యూ నేషన్ ఏపీ ఆపరేషనల్ హెడ్ నరేష్ నాయుడు ముత్తులూరు మాట్లాడుతూ రుచికరమైన బఫే వంటకాలకు బార్బిక్యూ నేషన్ ఎంతో ప్రసిద్ధి చెందినదన్నారు. ఈ ఫెస్టివల్ ద్వారా వినియోగదారులకు విభిన్నమైన వంటకాలతో చికెన్ విందును అందించనున్నామని చెప్పారు. నాన్ వెజ్ ప్రియుల కోసం ఈ మేళా ప్రారంభించామన్నారు. చికెన్ మరగ్ సూప్ తో సహా రుచికరమైన స్టార్టర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. భునా రసీలా కుక్కడ్, చికెన్ కీమా సమోసా, చికెన్ కీమా పావ్, హరే మసాలా తవా చికెన్, స్టఫ్డ్ చికెన్ చీజ్ టిక్కీ, క్రిస్పీ చికెన్ స్ట్రిప్స్, చిల్లీ స్వీట్ చికెన్ విడ్స్ కలవన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజనల్ మేనేజర్ సుమన్ ముఖర్జీ, బార్బిక్యూ నేషన్ హాస్పిటాలిటీ లిమిటెడ్ సీఈఓ రాహుల్ అగర్వాల్ మాట్లాడుతూ ఈ ఫుడ్ ఫెస్టివల్ ద్వారా మా అతిథులకు ఒక వినూత్నమైన భోజన అనుభూతిని అందించాలన్న లక్ష్యంతో ముందుకు వచ్చామన్నారు.

యోగ డేకు మండలం నుండి 8 వేల మంది : ఎంపీడీవో

విశాలాంధ్ర-ఆనందపురం : మండలంలో ఉన్న 18 సచివాలయాలు, 26 పంచాయతీల నుండి నేడు జరగనున్న అంతర్జాతీయ 11వ యోగ డే కార్యక్రమానికి ఆనందపురం మండలం నుంచి 160 బస్సులు,8 వేలు మంది పైగా పాల్గొంటారని, సచివాలయం ఇన్చార్జిలు, బస్సు వాహనాలు ఇన్చార్జిలు, పొలిటికల్ ఇన్చార్జులు, తో పటిష్టమైన ఏర్పాట్లు చేశామనీ, ముఖ్యఅతిథిగా హాజరవుతున్న భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి స్వాగతం పలికి ప్రపంచ స్థాయి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సృష్టించాలని, అలాగే గ్రామాల నుండి మండలం వరకు కూటమి నాయకులు అందరూ యోగ డే ని విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి వి.జానకి విజ్ఞప్తి చేశారు.

యోగా డే అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ దంపతులు

విశాలాంధ్ర-పెదగంట్యాడ : ప్రపంచ యోగా డే సంద్భంగా 75వ వార్డులో ఉన్న గౌతమ బుద్ద యోగా అండ్ మెడిటేషన్ సెంటర్ ఆధ్వర్యములో పెదగంట్యాడ జీవీఎంసీ మైదానంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సంస్థ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా 75వ వార్డు కార్పొరేటర్ మరియు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణారెడ్డి, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి పాల్గొని మన దేశానికి గర్వకారణం అయిన ప్రపంచ దేశాలు ఆచరిస్తున్న ఆరోగ్య సంజీవిని ఈ యోగా అని, ప్రజలందరూ దీనిని వాడుకొని ఆరోగ్యముగా ఆనందముగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు బొడ్డు గిరి, యోగా ప్రమోటర్లు పిట్ట గురునాథ్ రెడ్డి, దేవాడ ఈశ్వర రెడ్డి, యోగా సభ్యులు,స్థానికులు గొందేసీ పెంటయ్య రెడ్డి,బస అప్పల రెడ్డి,నీలాపు అప్పల రెడ్డి గొందేసీ అప్పల రాజు, గోవింద, శ్రీనివాస్, పైడిరాజు, ఎల్ ఐ సి అప్పారావు,అప్పారావు,, దొమ్మేటి సోము నాయుడు, నామాల అప్పారావు, మహిళలు పాల్గొన్నారు.

పంచ తత్వాలు సహాయంతో యోగాంధ్ర విజయవంతం

బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు

విశాలాంధ్ర-విశాఖ సిటీ : పంచ తత్వాలు, పరమశివుని శక్తి సహాయంతోనే యోగాంధ్ర -2025 పూర్తిగా విజయవంతం అవుతుందని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విశ్వవిద్యాలయం ప్రతినిధులు బి కే రామేశ్వరి, శివలీల, సోమేశ్వరి లు ఆకాంక్షించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం విజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టులకు ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించి అందరితో యోగా సాధకుడు సన్యాసిరావు ఆధ్వర్యంలో యోగాసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా తొలుత బ్రహ్మకుమారిస్ జర్నలిస్టులు సంయుక్తంగా విశాఖలో చేపట్టిన యోగాంధ్ర పూర్తిగా విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారిస్ ప్రతినిధులు రామేశ్వరి, శివలీలలు మాట్లాడుతూ పవిత్ర పుణ్య భారత దేశంలోనే యోగ పుట్టిందన్నారు. ప్రధాని మోడీ వల్లే ప్రపంచ దేశాలలో యోగాకు గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఇతర దేశాల్లో ఎక్కువగా వెస్టన్ నాగరికత కు ఇష్టం చూపిస్తారన్నారు. యోగ అంటే మూడు అర్థాలు ఉన్నాయని సంబంధము జోడించుట, కలయిక, ప్రాప్తిగా వీటిని చెప్పు కోవచ్చు అన్నారు. యోగం అనేది మతాలకు, కులాలకు,. ధర్మాలకు అతీతమైనదన్నారు. ప్రధాని మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తదితరులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర వైపు ఇప్పుడు ప్రపంచం అంతా చూస్తుందన్నారు. అందుకు విశాఖ వేదిక కావడం ఇక్కడ ప్రజల అదృష్టంగా భావిస్తున్నారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు,జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా జర్నలిస్టుల కోసం బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా యోగ డే వేడుకలు నిర్వహిస్తూ వస్తున్నా మన్నారు. యోగాంధ్రలో ఈఏడాది అందరమూ భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ దేశాల్లో యోగాకు గుర్తింపును తీసుకొచ్చింది ప్రధాని మోడీ కావడం అందరికి గర్వకారణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన ఈ యోగాంధ్ర పండుగ తప్పకుండా విజయవంత ము అవుతుంది అని అన్ని రికార్డులు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీనియర్ పాత్రికేయులు. ఆర్ నాగరాజు పట్నాయక్, మౌంట్ అబూకు చెందిన దిల్ రెడ్డి లు మాట్లాడుతూ యోగా డే సందర్భంగా బ్రహ్మ కుమారీస్ జర్నలిస్ట్ లకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం, ఆసనాలు వేయించి యోగా పై మక్కువ పెంచడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్ట్‌లు, బ్రహ్మ కుమారీస్ పెద్దఎత్తున ప్రార్ధనలో పాల్గొని కొంతసేపు యోగసనాలు వేసి ఉల్లాసం గా గడిపారు. రామేశ్వరి ఆధ్వర్యంలో ప్రసాదం వితరణ జరిగింది.

జగన్ నమ్మకం చంద్రబాబు మోసం పుస్తకాన్ని ఆవిష్కరించిన వైసిపి నేతలు

విశాలాంధ్ర-పెందుర్తి : జగన్ నమ్మకం చంద్రబాబు మోసం పుస్తకాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి గుడివాడ అమర్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్, సీనియర్ నాయకులు శరగడం చిన్నప్పలనాయుడు, యతి రాజుల నాగేశ్వరరావు, బైలపూడి భగవాన్ జైరాం, గండి రవికుమార్, ఉప్పిలి కనకరాజు, మదుపాడ అంజి, మెంటి మహేష్, దాడి ఉమా మహేష్ తదితరులు రాంపురంలోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఆవిష్కరించారు. నియోజకవర్గ సమన్వయకర్త అదీప్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ ప్రజలను, పాలనను గాలికొదిలేసి ప్రతిపక్షాలను వేధించడమే లక్ష్యంగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని విమర్శించారు. వందలాది మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి పైశాచికానందం పొందుతున్నారని మండి పడ్డారు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని దుయ్యబెట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేదని, జగన్ అమలు చేసిన అమ్మ ఒడినే పేరు మార్చి తల్లికి వందనం పేరుతో అమలు చేయాల్సిన దుస్థితి కూటమికి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీలన్నీ నెరవేర్చే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్ర అభివృద్ధిపై కుట్ర చేయడమే లక్ష్యమా..?

జగన్‌పై టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ధ్వజం

విశాలాంధ్ర-తగరపువలస : అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి వ్యవస్థలను నాశనం చేయడమే కాకుండా కుట్ర రాజకీయాలు ప్రోత్సాహించడమే లక్ష్యంగా జగన్ రెడ్డి వ్యవహార శైలి ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ధ్వజమెత్తారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. ఆరాచకాలు సృష్టించడం, రౌడీమూకలను వెనకేసుకొని రావడం దేనికి సంకేతమని అన్నారు. గుంటూరు జిల్లాలో సంవత్సరం క్రితం వైసిపీ అభిమానుడు చనిపోతే అతని విగ్రహం ప్రారంభోత్సవానికి వెళ్లి జగన్ రెడ్డి చేసిన నిర్వాకం ఏంటని అడిగారు. అభిమానులు ఫ్లెక్సీలు పెట్టడం తప్పుకాదని కానీ అందులో వేసిన క్యటేషన్స్ సంగతేంటని ప్రశ్నించారు. సినిమా డైలాగ్ అని చెప్పి రెచ్చగొట్టే రాతలు రాస్తే మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న జగన్ రెడ్డి అభిమానులను కంట్రోల్ చేయకపోగా సినిమా డైలాగ్ అని వెనకేసుకొని వస్తారా...? అని నిలదీశారు. ఇంకా మీకు అటువంటి సంస్కృతి పోయినట్టు లేదని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంటే రాష్ట్రంలో ఈ ఆరాచకాలు ఏంటని ప్రశ్నించారు. 2018 లో తెలుగుదేశం అధికారంలో ఉండగా అంతర్జాతీయ పారిశ్రామిక భాగస్వామ్యం సదస్సు విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తే ఆర్ కే బీచ్ లో ధర్నా అంటూ వచ్చి విమానశ్రయంలో నానా రాద్దాంతం చేసిన సంగతి మర్చావా జగన్ అని అన్నారు. ఇప్పుడు ప్రపంచం అంతా జూన్ 21న విశాఖలో జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం చూస్తుంటే అభిమాని విగ్రహం ఆవిష్కరణ అని యాగి చేయడం తగదని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఇలాంటి కార్యక్రమాలు సమయంలోనే మీకు ధర్నాలు, విగ్రహ ఆవిష్కరణలు గుర్తుకు వస్తాయా..? అని అన్నారు. జూన్ 12, 2025 న కూటమి సర్కార్ ఆదికారంలోకి వస్తే జూన్ 9న చనిపోయిన వ్యక్తి కూటమి వేశింపుల కారణంగా చనిపోయారని అనడానికి మీకు నోరెలా వచ్చిందని అడిగారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వారు ఎలాంటి నియమ నిబద్ధతతో ఉండాలో తెలియకపోతే ఎలా అని గంటా నూకరాజు జగన్ రెడ్డిని ప్రశ్నించారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

- చలనం లేని అధికారులు పోలీసు యంత్రాంగం
- రోజూ లక్షల్లో చీకటి వ్యాపారం

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం మండలంలోని అతిపెద్ద బ్లాక్ మార్కెట్ మండలంలోని మట్టి,గ్రావెల్ అక్రమ తరలింపు. రోజు లక్షల్లో చీకటి వ్యాపారం జరుగుతున్న చలనం లేని అధికారులు పోలీసు యంత్రాంగం. మండల కేంద్రంగా అక్రమ గ్రావెల్,మట్టి దందా,రోజు లక్షల్లో సంపాదను,కాసుల సంపాదనలో గ్రావెల్,మట్టి మాఫియా మండల తెలుగుదేశం యువ నాయకుడు కీలక పాత్ర? మైన్స్,రెవెన్యూ,పోలీస్ అ ధికారుల అండదండలు పుష్కలం-,యదేచ్ఛగా రాత్రి 10 నుంచి 4 గంటల సమయంలో గ్రావెల్, మట్టి తరలింపు-,ఫిర్యాదుదారులు జెసిబి, లారీల వీడియో, ఫోటోలను అధికారులకు పంపిన స్పందన శూన్యం. ఫిర్యాదుదారులపై సమాచారం - అక్రమ దారులు ఫిర్యాదూదారులు పై ప్రతి దాడులకు సన్నాహాలు,.ఈనెల 19 రాత్రి పద్మనాభం మండలానికి కూత వేటు దూరంలో(500 మీటర్లు) ఉన్న కృష్ణాపురం పంచాయతీ నుంచి ఈనెల 19 (శుక్రవారం)రాత్రి 10 గంటలనుంచి నాలుగు గంటల సమయంలో జెసిబి,సుమారు 30 లారీలతో కురపల్లి,రేవిడి, మహారాజుపేట జంక్షన్ మీదుగా అక్రమంగా తరలించి లక్షలు రూపాయల గ్రావెల్, మట్టి మాఫియా వ్యాపారం జరుగుతున్నట్టు స్థానికుల సమాచారం. ప్రజలు నిద్రావస్థలో ఉన్న రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల సమయంలో మాత్రమే అక్రమ మాఫియా దందా జరుగుతున్నట్టు తెలుస్తోంది.అయితే కొంతమంది యువకులు సంఘటన స్థలానికి రహస్యంగా చేరుకొని జెసిబి,లారీలకు వీడియోలు, ఫోటోలు తీసి పోలీస్, రెవెన్యూ యంత్రాంగానికి వాట్సాప్‌లలో పంపిస్తున్నప్పటికీ చర్యలు శూన్యమని వాపోతున్నారు. అంతేకాకుండా ఫోన్లు చేసి సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించిన పోలీస్, రెవెన్యూ ,మైన్స్ అధికారులు స్విచ్ ఆపి మాఫియా ముఠా నాయకుడికి సహకరిస్తున్నారు.ఎవరైనా అధికారులకు ఫోన్లో చేస్తే ఆయా నెంబర్లను గ్రావెల్, మట్టి మాఫియా నాయకుడికి సమాచారం ఇవ్వడంతో ,ఫిర్యాదుదారులపై మాఫియా నాయకుడు తన అనుచరులతో బెదిరింపులకు పాల్పడుతున్నట్టు వినికిడి.దీంతో కొంతమంది ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు.అలాగే పోలీసులు కూడా అర్ధరాత్రి మీరెందుకు ఆయా ప్రాంతాల్లో తిరుగుతున్నారని ,మిమ్మల్ని అనుమానతులుగా గుర్తించి ఎఫ్ఐఆర్ నమోదు చేయవలసి వస్తుందని హెచ్చరికలు చేస్తుండడంతో ఫిర్యాదులు భయభ్రాంతులను చెందుతున్నారు.దీంతో మట్టి మాఫియా నాయకుడికి,వారి అనుచరులకి గ్రావెల్, మట్టి అక్రమ తరలింపుకు అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో రోజు లక్షలు సంపాదిస్తూ మండలంలోని పలు గ్రామాల్లో చెలరేగిపోతున్నారు.అక్రమ గ్రావెల్, మట్టి తరలింపు చేస్తూ పోలీస్,అధికార యంత్రాంగానికి వారి వ్యాపారాల్లో వాటాలిస్తున్నట్లు స్థానికుల వాపోతున్నారు. మండలం అంతా కోడై కూస్తున్న అధికారులు, పోలీస్ వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పై పనులు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

సంక్షేమ పథకాల అమలు కోసం "యువత పోరు" కార్యక్రమం

-వైసిపి జిల్లా అధ్యక్షుడు కేకే రాజు
-యువత పోరు పోస్టల్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విశాఖ సిటీ : రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు పరచాలని డిమాండ్ చేస్తూ "యువత పోరు" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా వైసీపీ అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. శుక్రవారం వైసీపీ నగర్ కార్యాలయంలో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఉరుకోటి రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో "యువత పోరు" పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ మా అధినేత జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ చేసిన పోరాటాల కారణంగానే కూటమి ప్రభుత్వం ఇటీవల అమ్మఒడి పథకాన్ని కొంతమేరకైనా అమలు చేసిందన్నారు. నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం ప్రజల పక్షాన వైఎస్ఆర్ వైసిపి నిరంతర పోరాటాలు సాగిస్తోందన్నారు. బూత్ లెవెల్‌లో ఈ పోరాటాలు ఈ పోరాటాలు చర్చించుకునే విధంగా నిర్వహించాలన్నారు. ఈనెల 23వ తేదీన జిల్లా పరిషత్ జంక్షన్ నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌కి వినతిపత్రాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో నగర నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయ కర్తలు, వివిధ విభాగాల అధ్యక్షులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతూ కూటమి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉన్న 2 లక్షల 80 వేల మంది ఒలంటీర్లను ఉద్యోగాలు నుంచి తొలగించి వారిని రోడ్డున పడేసారన్నారు. ఎన్నికల ముందు లోకేష్ ప్రతియాట జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ఇంతవరకు క్యాలెండర్ లేదు, జాబ్ లేదని ఏద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, తైనాల విజయ్ కుమార్, వాసుపల్లి గణేష్ కుమార్, సమన్వయకర్తలు ముల్లి అప్పారావు, తిప్పల దేవన్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూన్ 21 తర్వాత అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి ఒకరోజు యోగా...

- విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో మంత్రి లోకేష్..
- గిన్నీస్ రికార్డ్ సృష్టించేలా 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసిన 25వేల మంది గిరిజన విద్యార్థులు..



విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మనం గర్వపడాల్సిన రోజు అని, యావత్ దేశంతో పాటు ప్రపంచం మొత్తం వైజాగ్ వైపు చూసిందని, ప్రపంచ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 25వేల మంది విద్యార్థులు ఒకేసారి సూర్యనమస్కారాలు చేసి చరిత్ర సృష్టించారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఈ నెల 21న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్రలో భాగంగా విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిన్నీస్ రికార్డ్ సృష్టించేలా 25 వేల మంది అల్లూరి జిల్లా గిరిజన విద్యార్థులు 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేశారు. అనంతరం మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఈ రోజు గిరిజన విద్యార్థులను చూస్తుంటే నాకు గుర్తుకువచ్చేది కమిట్ మెంట్, పట్టుదల. 108 నిమిషాల్లో 108 సూర్యనమస్కారాలు మీరు ఆనాడు చేసినప్పుడు మేం అందరం ఆశ్చర్యపోయాం. అంటే ఒక్క పిలుపుతో మీరంతా కష్టపడి దేశంతో పాటు ప్రపంచం మనవైపు చూసేలా చేసినందుకు ప్రభుత్వం తరపున మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.

25వేల మంది విద్యార్థులు ఒకేసారి సూర్య నమస్కారాలు చేయడం వరల్డ్ రికార్డ్... ఈ రోజు మనం గర్వపడాల్సిన రోజు. యావత్ దేశంతో పాటు ప్రపంచం మొత్తం వైజాగ్ వైపు చూసిన రోజు. ప్రపంచ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ రోజు మన గిరిజన విద్యార్థులు చరిత్ర సృష్టించారు. దాదాపు 25వేల మంది విద్యార్థులు ఒకేసారి సూర్య నమస్కారాలు చేయడం ఇదొక వరల్డ్ రికార్డ్. దీనిని రేపు ప్రకటిస్తారు. ఇక్కడున్న పిల్లలందరికీ గౌరవ ప్రధాని గారి తరపున, ముఖ్యమంత్రి గారి తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించుకునే అవకాశం ఇవ్వాలని, ఎన్నడూ జరగని విధంగా చేసి చూపిస్తామని ప్రధాని గారిని గౌరవ ముఖ్యమంత్రి గారు కోరడం జరిగింది. దీంతో ఎన్నడూ లేనివిధంగా 5 లక్షల మంది రేపు యోగాంధ్రలో పాల్గొని గిన్నీస్ రికార్డ్ సృష్టించబోతున్నారని తెలియజేస్తున్నా.

చంద్రబాబు నేర్పించిన క్రమశిక్షణ, పట్టుదలతోనే ఈ స్థాయికి వచ్చాను... యోగా అనేది కేవలం ఆసనాలు కాదు.. మన జీవన విధానం. మనందరికీ క్రమశిక్షణ నేర్పేది. నేను కూడా మీ వయసులో ఉన్నప్పుడు గౌరవ ముఖ్యమంత్రి నాతో యోగా చేయిపించేవారు. ఉదయం మేల్కోవాలంటే ఆయనను తిట్టుకునేవాడిని. ఆయన నేర్పించిన క్రమశిక్షణ, పట్టుదలతోనే ఈ రోజు నేను ఈ స్థాయికి వచ్చాను. అదే క్రమశిక్షణ, పట్టుదల మీ అందరిలో ఉంది. దీనిని మరువొద్దు. ఏ ఆశయాల కోసం మీరు ముందుకు వెళ్లాలనుకుంటున్నారో ఆ ఆశయాల కోసం నడవండి. విజన్ తో పనిచేయండి. మీరు ఏదైతే సాధించాలనుకున్నారో ఆ శక్తి మనలో ఉంది. మనం అందరం కలలు కనాలి. మన కుటుంబం, గ్రామం, మండలం, నియోజకవర్గం, రాష్ట్రం, దేశాన్ని మార్చాలనే కలలు కనాలి. అందుకోసం కష్టపడి పనిచేయాలి. పట్టుదలతో పనిచేయాలి. ఏ ఆశయం పెట్టుకున్నామో దానిని సాధించాలని కోరుతున్నా. మంత్రి సంధ్యారాణి గారిని ఈ సభాముఖంగా అభినందిస్తున్నా. ఇది ప్రారంభం మాత్రమే. ఏ పట్టుదలతో విద్యార్థులు సూర్యనమస్కారాలు చేశారో మా అందరిపై బాధ్యత పెరిగింది.

జూన్ 21 తర్వాత అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి ఒకరోజు యోగా... జూన్ 21 తర్వాత అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి ఒకరోజు యోగా చేసేలా ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకోవడం జరిగింది. కలెక్టర్ దినేష్ కుమార్ గారిని కూడా నేను అభినందిస్తున్నా. ఏడాది కాలంగా విద్యార్థులతో అద్భుతంగా ప్రాక్టీస్ చేయించారు. మాస్టర్ గారు కూడా పట్టుదలతో శిక్షణ ఇచ్చారు. ఈ రోజు విద్యార్థులు చరిత్ర సృష్టించారు. ఇందుకు విద్యార్థులందరికీ నా కృతజ్ఞతలు. ఈ రోజు మనం గర్వపడాల్సిన రోజు.

మోదీకి కానుకగా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఇచ్చాం... ఆంధ్రులుగా మన కోరికలన్నీ గౌరవ ప్రధాని తీరుస్తున్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపారు. విశాఖకు రైల్వే జోన్ కోరితే రైల్వే జోన్ ఇచ్చారు. ఆగిన ప్రజారాజధాని అమరావతి పనులు ప్రారంభించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎన్టీపీసీ లాంటి సంస్థలు కావాలని అడిగితే ఇచ్చారు. ఏపీ అన్నా, విశాఖ అన్నా ప్రధాని గారికి చాలా ప్రేమ. ఏడాదిలో రెండో సారి ప్రధాని విశాఖ వస్తున్నారు. ఆయనకు ఒక కానుకగా ఈ రోజు మనం అందరం గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఇచ్చాం.

దేవాన్ష్ గుర్తుకువస్తున్నాడు... మిమ్మల్నందరినీ చూస్తుంటే మా అబ్బాయి దేవాన్ష్ గుర్తుకువస్తున్నాడు. మీ అందరిలో ఉన్న క్రమశిక్షణ, పట్టుదలను దేవాన్ష్ కు నేర్పించాల్సిన అవసరం ఉంది. మాస్టర్ గారు ఏ ఆదేశాలైతే ఇచ్చారో క్రమశిక్షణ, పట్టుదలతో పాటించి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారని, దేశానికే దిశానిర్దేశం చేసినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, సీఎస్ విజయానంద్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎం.టి కృష్ణబాబు, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.